గురువారం 17, అక్టోబర్ 2024

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

### నేడు హర్యానాకు సీఎం చంద్రబాబు

సీఎం చంద్రబాబు గురువారం హర్యానాకు వెళ్లనున్నారు. పంచకులలో హర్యానా సీఎంగా నాయబ్ సింగ్‌సైనీ ప్రమాణ స్వీకారానికి హాజరవుతారు. అనంతరం చంఢీఘడ్‌లో ఎన్డీయే సీఎంల సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు.

## ఇవి.. ప్రగతి పాలసీలు

### 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- ఆరు నూతన పాలసీలు రాష్ట్ర ప్రగతిని మారుస్తాయి
- వన్ ఫ్యామిలీ.. వన్ ఎంటర్‌ప్రెన్యూర్ నినాదంతో ముందుకు
- రాష్ట్రంలో ఐదు జోన్లలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు
- 10 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయం
- ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత ఎదగాలన్నదే ఆశయం
- సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు
- ఉచిత ఇసుక విధానంలో రాజకీయ జోక్యాన్ని సహించేది లేదు
- అక్రమ మద్యం వ్యాపారం చేస్తే ఎంతటివారైనా వదిలిపెట్టం
- మాదక ద్రవ్యాలతో నేరాలకు పాల్పడితే సంఘ బహిష్కరణ
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు




పాలసీలపై ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

"వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆరు నూతన పబ్లిక్ పాలసీలు తెచ్చాం. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 4.0, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0, ఏపీ ఎంఎస్ఎంఈ-ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0, ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 4.0, ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0. ఇవన్నీ -జాబ్ ఫస్ట్ అన్న ఆశయంతో తెచ్చినవే. రాష్ట్రాభివృద్ధి, ఉపాధి ఉద్యోగాల కల్పనే పాలసీల లక్ష్యం. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ (ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త), థింక్ గ్లోబల్లీ, యాక్ట్ గ్లోబల్లీ అనేది ఎన్డీయే ప్రభుత్వ నినాదం. ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత ఎదగాలన్నదే ప్రభుత్వ ఆశయం. ఈ ఆరు పాలసీలు రాష్ట్ర ప్రగతినే మారుస్తాయనడంలో సందేహం లేదు. ఇదొక గేమ్ ఛేంజర్. గతంలో ఎంత పెట్టుబడి పెడుతున్నారు అనే దృక్పథంతో వెళ్లే వాళ్లం. ఇప్పుడు ఎన్ని ఉద్యోగాలు కల్పిస్తారన్న దృక్పథంతో ముందుకెళ్తున్నాం."



2



### పసికందుకు పునర్జన్మ

ఐటీ మంత్రి నారా లోకేష్ పెద్దమనను ఓ పసికందుకు పునర్జన్మనిచ్చింది. తమ బిడ్డ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని, వైద్య సాయంచేసి ఆదుకోవాలంటూ ప్రజాదర్బార్‌కు తరలివచ్చి వేడుకున్న ఆ తల్లిదండ్రులకు లోకేష్ భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందించి పసికందు ప్రాణాలు కాపాడారు.

3

## కుండపోత వానలు

- నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావం
- దక్షిణ కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఏపీఎస్డీఎంఏ
- రాష్ట్రంలో భారీ వర్షాలపై ముఖ్యమంత్రి సమీక్ష
- ప్రమాద నివారణ చర్యలు సూచించిన చంద్రబాబు

5



భారీ వర్షాలతో మునిగిన తిరుపతి రోడ్లు



## బీసీలకు రక్షణ కవచం

- కొత్త చట్టంపై బీసీ మంత్రుల చర్చ
- విధివిధానాలపై తొలిసారి భేటీ
- హోంమంత్రి సహా 9మంది మంత్రుల హాజరు

4



అమరావతి అభివృద్ధి పనులు

## పరుగో పరుగు!

- డిసెంబరు నాటికి వివిధ పనులకు టెండర్లు
- సీఎం అధ్యక్షతన 38వ సీఆర్డీఏ సమావేశం
- వివరాలు వెల్లడించిన మంత్రి నారాయణ

4

## జగన్ పేరిట బెదిరింపులు

- బాకీ అడిగితే చంపేస్తామంటున్నారని బాధితుల ఆవేదన
- రీ సర్వే జిమ్మిక్కులు.. మరొకరి పేరుపైకి ఆస్తులు
- భూమి రిజిస్ట్రేషన్ చేసుకోనివ్వకుండా దౌర్జన్యం
- మంగళగిరి టీడీపీ కార్యాలయానికి వినతులు



8

చైతన్యరథం

# 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- ఆరు నూతన పాలసీలు రాష్ట్ర ప్రగతిని మారుస్తాయి
- వన్ ఫ్యామిలీ.. వన్ ఎంటర్‌ప్రెన్యూర్ నినాదంతో ముందుకు
- రాష్ట్రంలో ఐదు జోన్లలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు
- 10 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయం
- ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి యువత ఎదగాలన్నదే ఆశయం
- సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు
- ఉచిత ఇసుక విధానంలో రాజకీయ జోక్యాన్ని సహించేది లేదు
- ప్రజలపై అనవసర కేసులు పెడితే అధికారులను సస్పెండ్ చేస్తాం
- అక్రమ మద్యం వ్యాపారం చేస్తే ఎంతటివారైనా వదిలిపెట్టం
- మాదక ద్రవ్యాలతో నేరాలకు పాల్పడితే సంఘ బహిష్కరణ
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు




అమరావతి(చైతన్యరథం): రాబోయే ఐదు సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆరు నూతన పబ్లిక్ పాలసీలు తీసుకొచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ ఆరు కొత్త పబ్లిక్ పాలసీల గురించి వివరించారు. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 4.0, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0, ఏపీ ఎంఎస్ఎంఈ-ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0, ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 4.0, ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0 అనే పాలసీలను జాబ్ ఫస్ట్ అనే ఆశయంతో తీసుకొచ్చినట్టు చెప్పారు. రాష్ట్రాభివృద్ధి, ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఈ పాలసీలు రూపొందించినట్టు తెలిపారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ (ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త), థింక్ గ్లోబల్లీ, యాక్ట్ గ్లోబల్లీ అనేది తమ నినాదమన్నారు. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి యువత ఎదగాలన్నదే తమ ఆశయమని వివరించారు. ఈ ఆరు పాలసీలు రాష్ట్ర ప్రగతినే మార్చేస్తాయని.. ఇది ఒక గేమ్ ఛేంజర్ అని వ్యాఖ్యానించారు. గతంలో ఎంత పెట్టుబడి పెడుతున్నారు అనే దృక్పథంతో వెళ్లే వాళ్లమని, ఇప్పుడు ఎన్ని ఉద్యోగాలు కల్పిస్తున్నారనే దృక్పథంతో ముందుకెళుతున్నామని తెలిపారు.

## రతన్ టాటా పేరిట ఇన్నోవేషన్ హబ్‌లు

విలువలతో కూడిన వ్యాపారం చేయడం ద్వారా వ్యాపార సామ్రాజ్యం సృష్టించవచ్చు అని చెప్పడానికి రతన్ టాటా ఒక ఉదాహరణ. ఆయన తన తెలివితేటలు, నిజాయితీతో 28 కంపెనీలు స్థాపించారు. 400 బిలియన్ డాలర్ల వ్యాపారం చేశారు. తన వ్యాపార సామ్రాజ్యాన్ని వంద దేశాలకు విస్తరించగలగడం చాలా గొప్ప విషయం. ఆయన పేరిట రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలో ఒక ప్రధాన ఇన్నోవేషన్ హబ్ ఉంటుంది. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలన్నింటికీ ఉపయోగకరంగా ఉండేలా విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతపురం ఐదు జోన్లలో కూడా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఇవన్నీ నాలెడ్జ్ హబ్‌లుగా ఉంటాయి. గత ప్రభుత్వం తీరు వల్ల మన రాష్ట్రానికున్న బ్రాండ్ ఇమేజ్ మొత్తం దెబ్బతింది. దాన్ని మళ్లీ పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రపంచానికి ఏపీని ఆక్వా కల్చర్ హబ్‌గా తయారు చేస్తాం. ఫుడ్ ప్రాసెసింగ్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం. రాబోయే రోజుల్లో రాయలసీమ రతనాల సీమగా మారుతుంది. రాష్ట్రాన్ని గ్లోబల్లీ అట్రాక్టివ్ మాను ఫ్యాక్చరింగ్ హబ్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దుతాం. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175కి పైగా ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తాం.

## ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ

పరిశ్రమలు స్థాపించే వారిని ప్రోత్సహించేలా భారతదేశంలోనే ఒక బెస్ట్ పాలసీని రూపొందించాం. కంపెనీలు స్థాపించే వారు పెట్టే మూలధన పెట్టుబడిలో 75 శాతం ఇన్సెంటివ్స్‌గా ఇస్తున్నాం. అలాగే రాయితీలు కూడా వారు ఇచ్చే ఉద్యోగాలను బట్టి ఉండేలా రూపొందించాం. జాబ్ ఫస్ట్ అనేది మా మొట్టమొదటి ప్రాధాన్యం. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ అనే ఆశయంతో చేపట్టిన పాలసీ ఇది. ఎంఎస్ఎంఈలకు రూ.500 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో ఉండే ఎంఎస్ఎంఈలు అన్నింటికీ కూడా నేషనల్ పోర్టల్ పెడతాం. వీకర్ సెక్షన్‌లకు ప్రత్యేక రాయితీలు ఇస్తామని వివరించారు.

## ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ

ఎంఎస్ఎంఈలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. 3 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నాం. వేస్ట్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు రాయితీలు కల్పిస్తాం. కోల్డ్ చైన్ లింక్ ఏర్పాటు చేస్తాం. రూ.100 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టే వారికి ప్రత్యేక రాయితీలు ఇస్తాం. ఈ రంగంలో రూ.30 వేల కోట్ల పెట్టుబడులు సాధనే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.

## ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ

రూ.84 వేల కోట్ల పెట్టుబడులు.. 5 లక్షల మందికి ఉపాధి కల్పన లక్ష్యంగా ఈ పాలసీ తీసుకొచ్చాం. 10 ఎకరాలలో నానో పార్కులు, 10-100 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు, 100-1000 ఎకరాల్లో లార్జ్ పార్కులు, 1000కి పైగా ఎకరాల్లో మెగా పార్కుల నిర్మాణం చేపడతాం. పారిశ్రామిక అభివృద్ధి జరగాలంటే ముందు మౌలిక సదుపాయాలు ఉండాలి. ప్రస్తుతం నాలుగు ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయి. ఇప్పుడు ఈ పాలసీలో నాలుగు విధాలుగా ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసేలా తీసుకొచ్చాం. నానో పార్కులు, ఎంఎస్ఎంఈ, లార్జ్ పార్కులు, మెగా పార్కులు ఏర్పాటు చేసుకునే విధానం తీసుకొచ్చాం.

## ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ

రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు, 7.50 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా ఈపాలసీ రూపొందించాం. 5000ఈవీ చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటుచేస్తాం. బినామీలకు చోటు లేకుండా నిజమైన పారిశ్రామికవేత్తలకు అవకాశం కల్పిస్తాం. సింగిల్ విండో క్లియరెన్స్ ఇస్తాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ డ్రీమ్డ్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తాం. ప్రపంచంలోనే ఏపీని గ్రీన్-గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం.

## మల్లవల్లిలో ఎంఎస్ఎంఈలకు న్యాయం చేస్తాం

మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కు ఇదో విషాదభరితమైన సంఘటన. 35 వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా నాడు ఒక పాలసీ తీసుకొచ్చాం. 1,360 ఎకరాల్లో ఎంఎస్ఎంఈలు పెట్టేలా పరిశ్రమలు పెట్టే వారికి గతంలో ఎకరా రూ.16.50 లక్షలకు ఇచ్చాం. గత ప్రభుత్వం ఆ భూమి రేటును రూ.89.16 లక్షలు చేసింది. వాళ్లను వేధింపులకు గురి చేసింది. వాళ్లలో చాలామంది కోర్టులకు వెళ్లారు. ఇప్పుడు మళ్లీ నాడు పరిశ్రమలు స్థాపించ డానికి వచ్చిన 349 మందికి వారికి కేటాయించి ఎకరా రూ.16.50 లక్షల ధరకే భూమిని కేటాయిస్తున్నాం. అయితే వారు ఆరు నెలల్లో పనులు మొదలుపెట్టాలి. రెండేళ్లలో ప్రాజెక్టును కంప్లీట్ చేయాలని తెలిపారు.

## లోకేష్ నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీ

రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం సాధించడానికి మంత్రివర్గ ఉపసంఘా న్ని ఏర్పాటు చేశాం. ఐటీ మంత్రి నారా లోకేష్ దీనికి చైర్మన్‌గా ఉంటారు.ఇందులో మంత్రులు టీజీ భరత్, గొట్టిపాటి రవి, కందుల దుర్గేశ్, కొండపల్లి శ్రీనివాస్, పి.నారాయణ, బీసీ జనార్దన్‌రెడ్డిలు సభ్యులుగా ఉంటారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు కూడా మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశాం. అలాగే స్వర్ణకారుల కోసం ఒక ప్రత్యేక కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

## గంజాయిని ఉక్కుపాదంతో అణిచివేస్తాం

రాష్ట్రంలో గంజాయి, మాదక ద్రవ్యాల విక్రయాలను ఉక్కుపాదంతో అణచివేస్తాం. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, బాధితులకు పునరావాసం లాంటి అంశాలు అధ్యయనం చేసేందుకు మంత్రి వంగలపూడి అనిత చైర్‌పర్సన్‌గా క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేశాం. రాష్ట్రంలో చాలావరకు నేరాల వెనక గంజాయి బ్యాచ్ ఎక్కువగా ఉంటోంది. వాళ్లను ఉక్కుపాదంతో అణచివేస్తాం. ఇందులో రాజీపడే ప్రసక్తే లేదు. అవసరమైతే అలాం టి వాళ్లను సంఘ విద్రోహులుగా ప్రకటించేలా చర్యలు తీసుకుంటాం. రౌడీషీట్లు తెరచి పోలీసుస్టేషన్లలో వారి ఫొటోలు పెట్టి వారిని విదేశాలకు వెళ్లనివ్వకుండా చేస్తాం. గంజాయి, డ్రగ్స్‌తో నేరాలకు పాల్పడే వారిని సంఘ బహిష్కరణ కూడా చేసేలా చర్యలు తీసుకుంటా మని తెలిపారు.

## అక్రమ మద్యం వ్యాపారం చేస్తే ఉపేక్షించం

రాష్ట్రంలో డ్రగ్స్, అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తే ఏ పార్టీ వారైనా..ఎంతటి వారినైనా వదలిపెట్టేది లేదని హెచ్చరించారు. అందరూ ప్రభుత్వం తెచ్చిన మద్యం విధానా న్ని అనుసరించాల్సిందేనని స్పష్టం చేశారు. ఇందులో రాజీపడే ప్రసక్తే లేదని తెలిపారు. గత ప్రభుత్వం చేసినవన్నీ చెత్త పనులు. వాళ్లు రాష్ట్రంలో కనీసం చెత్తను కూడా శుభ్రం చేయకుండా వదిలేసి వెళ్లిపోయారు. చెత్త మీద పన్ను వేసి రాష్ట్రంలో 85 లక్షల మెట్రిక్ టన్నులు చెత్త శుభ్రం తొలగించకుండా అలాగే వదిలేసి పోయారు. మళ్లీ ఇప్పుడు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు. ఇలాంటి నాయకులు రాజకీయాల్లో ఉండే అర్హత కూడా లేదు. వాళ్లు చేసిన చెత్త పన్నును రద్దు చేస్తున్నాం. వీళ్లు తొలగించకుండా వదిలేసి వెళ్లిన చెత్తను తొలగించాలంటే రూ.వెయ్యి నుంచి రెండు వేల కోట్లు ఖర్చు అవుతుందని అసహనం వ్యక్తం చేశారు.

## రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు

వైసీపీ నేతలు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారు. రథాన్ని తగలబెడతారు.. మళ్లీ నాటకాలు ఆడతారు. బుద్ధి జ్ఞానం ఉండాలి. అలాంటి సంఘటనలను ఖండించి క్షమాపణలు చెప్పాల్సిందిపోయి మళ్లీ సిగ్గు లేకుండా విమర్శలు చేస్తారా? సీసీ కెమెరాల్లో వారి బండారం బయటపడింది. రాష్ట్రంలో 14 వేల కెమెరాలు ఉన్నాయి. కనీసం వాటిని గత ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఉపయోగించుకోలేదు అంటే ఏం చెప్పాలో అర్థం కావడం లేదు. అంత దారుణంగా రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. పంటలపైన అప్పుడప్పుడు అడవి పందులు పడుతుంటాయి. అవి పంట తిని వెళ్లవు.. వెళుతూ వెళుతూ ఆ పంట మొత్తాన్ని సర్వనాశనం చేసి వెళుతుంటాయి. ఆ తరహాలో వీళ్లు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు.

## గుంతలు కూడా పూడ్చలేదు

గత ప్రభుత్వం కనీసం రోడ్లపై పడిన గుంతలు కూడా పూడ్చలేదని మండిపడ్డారు. పంచాయతీ రోడ్లకు సంబంధించి జవాబుదారీతనం లేకుండా టెండర్లు వేశారు. పనులు చేయకుండా నిధులు తినేశారు. కనీసం ఆ ఫైళ్లు కూడా కనిపించడం లేదు. రహదారులపై ఉన్న గుంతలను రూ.600 కోట్లతో పూడ్చేస్తున్నాం. సంక్రాంతి తరువాత రాష్ట్రంలో గుంతల రహిత రహదారులు కనిపించేలా చేస్తున్నామని తెలిపారు.

## ఉచిత ఇసుక విధానంలో రాజకీయ జోక్యం ఉండదు

ఇసుక విధానంలో ఎలాంటి రాజకీయ జోక్యాన్ని సహించబోమని తెలిపారు. ప్రజాప్రతి నిధులు ఎవ్వరూ కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దని సూచించారు. జిల్లాకు ఒక మంత్రిని ప్లానింగ్ బోర్డు చైర్మన్‌గా వేశాం. ఆ జిల్లాలో ఇసుక ఉచితంగా లభించేలా చూడా ల్సిన బాధ్యత వాళ్లదేనని స్పష్టం చేశారు. ఎడ్లబండి, ట్రాక్టరు తీసుకొచ్చి ఎవరైనా ఇసుక తీసుకుని వెళుతుంటే వాళ్లపైన అనవసరంగా కేసులు పెట్టొద్దని సూచించారు. అలా కేసులు పెడితే అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలు వాళ్లు నివసిస్తున్న ఊళ్లో ఉన్న ఏట్లో వాళ్లకు కావాల్సిన ఇసుక తీసుకునే స్వేచ్ఛ లేకపోతే ఎలా? ఎవరైతే ఇసుక స్వయంగా అక్కడికి వెళ్లి తెచ్చుకోలేకపోతున్నారో వారికి ఫెసిలిటేటర్లుగా మాత్రమే కలెక్టర్లు, అధికారులు ఉండాలని స్పష్టం చేశారు.

### మింగినదంతా కక్కిస్తాం

గత ప్రభుత్వంలో ఇసుక ఇష్టానుసారం అమ్మేసుకున్నారు. గత ఐదేళ్లలో ఎవరైనా స్వేచ్ఛగా ఎక్కడైనా వాగులు, నది వద్దకు వచ్చి ఇసుక తీసుకెళ్లే పరిస్థితి ఉందా? అంత అరాచకమా, అంత అహంభావమా? ప్రజాస్వామ్యంలో కనీసం ఈ అన్యాయాన్ని అడిగే పరిస్థితి లేకపోయిందని మండిపడ్డారు. ఐదేళ్లలో నాకే ప్రశ్నించే అవకాశం లేకుండా చేశా రు. ప్రజాస్వామ్యంలో మనం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రశ్నించిన వాళ్లకు మనం జవాబుదారీ తనంతో సమాధానం చెప్పాలి. అలాంటి పరిస్థితి కల్పించారా వీళ్లు అని ధ్వజమెత్తారు.

## అమరావతి అభివృద్ధి పనులు

# పరుగో పరుగు!



- డిసెంబరు నాటికి వివిధ పనులకు టెండర్లు
- సీఎం అధ్యక్షతన 38వ సీఆర్డీఏ సమావేశం
- వివరాలు వెల్లడించిన మంత్రి నారాయణ

అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర రాజధాని అమరావతిలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలు మినహా మిగిలిన అన్ని పనులకు టెండర్లను డిసెంబరు మాసాంతానికల్లా పిలవనున్నట్టు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. ఈ పనులన్నీ ఏడాది నుండి రెండున్నరేళ్లలోపు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అధ్యక్షతన 38వ సీఆర్డిఏ సమావేశం బుధవారం సచివాలయంలో జరిగిందన్నారు. సమావేశంలో రాజధాని అమరావతి అభివృద్ధికి సంబంధించి తీసుకున్న పలు నిర్ణయాలను వెల్లడించారు. 2014-19 మధ్యకాలంలో అమరావతి రాజధాని ప్రాంతంలో దాదాపు 3,600 అపార్టుమెంట్లు కట్టినట్టు గుర్తు చేశారు. వాటిలో శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు మరియు ఐ.ఏ.ఎస్. అధికారులు నివాసానికి సంబంధించి 432 ప్లాట్లతో కూడిన 18 టవర్ల నిర్మాణాలను గతంలో చేపట్టి దాదాపు పూర్తి చేశామన్నారు. అయితే సివరేజ్ ప్లాంట్, త్రాగునీటి సరఫరా, క్లబ్ హౌస్ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని రూ.524 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు బుధవారంనాటి సమావేశంలో క్లియరెన్సు వచ్చిందని, రెండు మూడు రోజుల్లో వాటికి సంబంధించిన టెండర్లను పిలిచి 20 రోజుల్లో పనులను ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. సీఆర్డిఏ కార్యాలయం కోసం గతంలో తమ ప్రభుత్వం జి7 భవన నిర్మాణాన్ని చేపట్టి స్ట్రక్చర్ పూర్తి చేశామని, అయితే గత ప్రభుత్వం దాని నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. రూ.160 కోట్లతో దాన్ని పూర్తి చేసేందుకు సమావేశంలో ఆమోదించామని, గతంలోనే ఈ పనులకు సంబంధించిన టెండర్లు ఖరారైన నేపథ్యంలో వీటి పనులను నాలుగైదు రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. సీఆర్‌డీఏ, ఏడీసీ, మెప్మా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, మున్సిపల్ ఆఫీసు తదితర కార్యాలయాలన్నీ ఈ భవనంలో ఏర్పాటు చేస్తామన్నారు. 2014-19 మధ్య కాలంలో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ దాదాపు 360 కి.మి. మేర ట్రంక్ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందని, అవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అయితే వాటి కాలపరిధి పూర్తైన నేపథ్యంలో డిసెంబరు మాసాంతానికల్లా తిరిగి టెండర్లను పిలుస్తామన్నారు. రాజధాని ప్రాంతం ఎటువంటి వరదలకు, ముంపునకు గురయ్యే అవకాశం లేకుండా ఉండేందుకు.. కొండవీటి వాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్ డిజైన్లను రూపొందించే పనిని నెథర్లాండ్ నిపుణులకు అప్పగించామన్నారు. అయితే ఈమధ్య కాలంలో బుడమేరు వల్ల విజయవాడ నగరానికి సంభవించిన ముంపును దృష్టిలో ఉంచుకుని మరింత పటిష్టవంతంగా డిజైన్లు రూపొందించాలని ఆర్‌వి కన్సల్టెన్సీకి అప్పగించడం జరిగిందని, ఆ డిజైన్ పనులు కూడా త్వరలో పూర్తి కానున్నాయని, వాటికి సంబంధించిన టెండర్లను నవంబరు మాసాంతానికిల్లా పిలుస్తామన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఐకానిక్ టవర్లకు సంబంధించిన టెండర్లను కూడా డిసెంబరు చివరికల్లా పిలుస్తామన్నారు. 2009లో వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని కరకట్ట రోడ్డు డిజైన్ చేయడం జరిగిందని, అయితే బుడమేరు వరద దృష్ట్యా రీ డిజైన్ చేసేందుకు కన్సల్టెన్సీకి అప్పగించామని, ఆ పనులనకు సంబంధించి 15 రోజుల్లో టెండర్లు పిలుస్తామన్నారు. జాతీయ రహదారికి అనుసంధానంగా నిర్మించేందుకు ప్రతిపాదించిన రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లను రెండు మాసాల్లో పిలవనున్నట్టు మంత్రి నారాయణ వెల్లడించారు.

ప్రపంచ బ్యాంకు నిధులు రూ.15వేల కోట్ల మంజూరుకు సంబంధించి పర్యావరణం మరియు సోషల్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై చర్చలు జరుగుచున్నాయని, ఈ ప్రక్రియ దాదాపు పూర్తికావచ్చిందన్నారు. నవంబరు లేదా డిసెంబరు మాసాల్లో ఈ నిధులు కూడా మంజూరయ్యే అకాశం ఉందన్నారు. ఇకపై ఎప్పటికప్పుడు సీఆర్‌డీఏ అకౌంట్స్ సబ్‌మిట్ చేయడం జరుగుతుందన్నారు. రాజధాని రైతులకు త్వరలోనే ప్లాట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. పరిహారం విషయంలోనూ రైతులకు ఎట్టిపరిస్థితుల్లో అన్యాయంజరగదని స్పష్టంచేశారు. రాజధాని నిర్మాణం విషయంలో దాదాపు జంగిల్ క్లియరెన్స్ కూడా పూర్తి కావొచ్చిందన్నారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి సమావేశంలో పాల్గొన్నారు.

---

- కొత్త చట్టంపై బీసీ మంత్రుల చర్చ
- విధివిధానాలపై తొలిసారి భేటీ
- హోం సహా 9మంది మంత్రుల హాజరు

# బీసీలకు రక్షణ కవచం!



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు గౌరవప్రదమైన జీవనం అందించడమే లక్ష్యంగా బీసీ రక్షణ చట్టం రూపొందిస్తున్నట్టు బీసీ మంత్రులు స్పష్టం చేశారు. ఈ చట్టం వెనుకబడిన తరగతులకు రక్షణ కవచంలాంటిదని అభిప్రాయపడ్డారు. ఎన్నికల ముందు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న అన్ని అంశాలనూ అమలు చేయడానికి సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. బుధవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం మూడో బ్లాక్‌లో నిర్వహించిన బీసీ రక్షణ చట్టం విధివిధానాల రూపకల్పనపై నిర్వహించిన తొలి సమావేశంలో ఎనిమిది మంత్రులు.. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎస్ సవిత, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, సత్యకుమార్ యాదవ్, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్ సహా హోంమంత్రి అనిత పాల్గొన్నారు. ముందుగా బీసీ రక్షణ చట్టం ఆవశ్యకతను రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత... మంత్రులకు వివరించారు. జగన్ హయాంలో రాష్ట్రంలో బీసీల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ కరవైందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు బలైపోతున్న బీసీల దుస్థితిని మీకోసం బస్సు యాత్రలో సీఎం చంద్రబాబు, యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ స్వయంగా పరిశీలించారన్నారు. బీసీలను ఆదుకోవాలని నిర్ణయించి... సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ బీసీ డిక్లరేషన్ ప్రకటించారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలను అమలు చేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలకు కట్టుబడుతూ, సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టారన్నారు. ఇటీవలే చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్‌లో తీర్మానం చేసి కేంద్రానికి సిఫార్సు చేశారన్నారు. ఆదరణవంటి పథకాల అమలుకు నిర్ణయం తీసుకున్నారని మంత్రి సవిత తెలిపారు. ఇదే సమయంలో బీసీ రక్షణ చట్టం విధివిధానాల రూపకల్పనకు చర్యలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగానే బీసీ మంత్రులతో సమావేశం నిర్వహిస్తున్నామని సవిత తెలిపారు. కులపరంగా, వ్యక్తిగతంగా దూషించినా చర్యలు తీసుకునేలా చట్టం రూపొందిస్తున్నామన్నారు. ఏపీలో అమలు చేయబోయే బీసీ రక్షణ చట్టం దేశంలోనే తొలిసారని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ బీసీ చట్టం రూపకల్పనలో న్యాయ నిపుణులు, రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర సమాచార పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ చట్టాన్ని పకడ్బందీగా రూపొందించాలన్నారు. ఇందుకోసం ఇతర చట్టాలను అధ్యయనం చేయాలన్నారు. మంత్రి కొల్లురవీంద్ర మాట్లాడుతూ జగన్ హయాంలో బీసీలపై జరిగిన దాడులను చూసి వెనుకబడిన తరగతుల రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించాలని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నిర్ణయించారన్నారు. చట్టం రూపకల్పనలో సెక్షన్లు, ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి రూపొందించాలన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో బీసీల రక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి, చట్టం రూపకల్పనలో వినియోగించాలన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ చట్టం బీసీలకు రక్షణ కవచంలా ఉండాలన్నారు. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, బీసీ రక్షణ చట్టం రూపకల్పనలో మరిన్ని పర్యాయాలు సమావేశాలు నిర్వహించాలన్నారు. అంతకుముందు బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్ మాట్లాడుతూ బీసీల్లో ఎన్ని ఉప కులాలు ఉన్నాయి., వాటికి రిజర్వేషన్ల అమలు తీరుతెన్నులను వివరించారు. బీసీ రక్షణ చట్టంతో బీసీల్లో తీవ్రంగా వెనుబడిన కులాలకు మేలు కలుగుతుందన్నారు. వచ్చే సమావేశంలో న్యాయ నిపుణులు సలహాలు తీసుకుని పూర్తి వివరాలతో హాజరుకావాలని బీసీ సంక్షేమ అధికారులకు మంత్రులు స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర ఎంజేపీ గురుకుల పాఠశాలల కార్యదర్శి కృష్ణమోహన్, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు మాధవీలత ఇతర అధికారులు పాల్గొన్నారు.



- నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావం
- దక్షిణ కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఏపీఎస్డీఎంఏ
- రాష్ట్రంలో భారీ వర్షాలపై ముఖ్యమంత్రి సమీక్ష
- ప్రమాద నివారణ చర్యల సూచించిన చంద్రబాబు

# కుండపోత వానలు



విజయవాడ (చైతన్యరథం): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, వైఎస్ఆర్ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది.

ఇదిలావుంటే -నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గంటకు 15కి.మీ వేగంతో దూసుకొస్తోంది. దీని ప్రభావంతో ఇప్పటికే దక్షిణకోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. చెన్నైకి 280 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 320 కిలోమీటర్లు.. నెల్లూరుకు 370 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉందని వాతావరణశాఖ తెలిపింది. పశ్చి మ వాయవ్య దిశగా 15కిలోమీటర్ల వేగంతో కదులు తోందని ప్రకటించింది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలోని కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే -ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, వైఎస్ఆర్ జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. సహాయక చర్యల కోసం జిల్లాల్లో 5 ఎస్డీఆర్ఎఫ్, 2 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అధికారులు సిద్ధంగా ఉంచారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. నిన్నటి నుంచి నెల్లూరు సహా పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలపై బుధవారం అధికారులతో సమీక్షించారు. కొన్ని ప్రాంతాల్లో 20 సెంటీమీటర్లకు పైగా వర్షం పడడం, ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందన్న సమాచారం నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని సీఎంవో అధికారులకు సూచించారు.

ఇదిలావుంటే.. నెల్లూరు నగరంతో పాటు కావలి, అల్లూరు, బిట్రగుంట, గుడ్లూరు, లింగసముద్రం, వింజమూరు, వరికుంటపాడు, ఇందుకూరుపేట, కొండాపురం ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వరికుంటపాడు మండలం కనియంపాడులో పిల్లపేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొండాపురం మండలం సత్యవోలు అగ్రహారం వద్ద మిడతవాగులోకి వరద చేరుతోంది. స్వర్ణముఖి నదిలో వరద ప్రవాహం పెరుగుతోంది.

ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి, దర్శి రాజుపాలెం, కొత్తపట్నం, సింగరాయకొండ తదితర ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. తీరప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలిస్తున్నారు. సహాయ క చర్యలకు ఎన్డీఆర్ఎఫ్‌తోపాటు 360మంది పోలీసు లతో 18 బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఉమ్మడి కడప జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. కడప బస్టాండ్‌లోకి భారీగా వరదనీరు చేరింది. పోరుమామిళ్ల, ఒంటిమిట్ట లో అత్యధిక వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు.

తిరుపతి జిల్లావ్యాప్తంగా ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్నాయి. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని తీర ప్రాంతాల్లో వర్షం పడుతోంది. లోతట్టు ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. శ్రీకాళహస్తి-తడమార్గంలో రాకపోకలు స్తంభించిపోయాయి. ఎగువ ప్రాంతాల వరదతో స్వర్ణముఖి నదిలో నీటిమట్టం పెరుగుతోంది. తిరుమల కనుమ రహదారుల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో తితిదే అప్రమత్తమైంది. శ్రీవారి పాదాలు, జాపాలి, ఆకాశగంగకు భక్తులను అనుమతించడం లేదు. వర్షాల కారణంగా ఇప్పటికే తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు తితిదే రద్దు చేసిన విషయం తెలిసిందే.

### తిరుమల ఘాట్‌రోడ్డులో విరిగిపడిన కొండ చరియలు

వర్షాల కారణంగా తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో స్వల్పంగా బండరాళ్లు రోడ్డుపై పడ్డాయి. జేసీబీల ద్వారా సిబ్బంది వాటిని తొలగిస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తితిదే ముందస్తు చర్యలు చేపట్టింది. శ్రీవారి పాదాలు, ఆకాశ గంగ, జాపాలి, పాపవినాశనానికి భక్తులను తితిదే అనుమతించడం లేదు. ఇప్పటికే తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దుచేశారు. వర్షాల కారణంగా భక్తుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. తిరుమల గిరుల్లో వర్షాలతో మాల్వాడిగుండం భారీగా ప్రవహిస్తోంది. కొండల నుంచి వస్తున్న నీటితో తిరుపతి కాలనీల్లోకి వరద వచ్చి చేరుతోంది. రాజీవ్ గాంధీ కాలనీ, ఆటోనగర్, కొరమీనుగుంటలో వరద వస్తోంది. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం గుడిమల్లం వద్ద సీత కాల్వ కాజ్‌వేపై నీరు ప్రవహిస్తోంది. వర్షాల కారణంగా జిల్లా కలెక్టరేట్‌తోపాటు మండల, డివిజన్, జిల్లాస్థాయిలో కంట్రోల్‌రూంలు ఏర్పాటు చేశారు. గూడూరు సబ్ కలెక్టరేట్‌లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని తీరప్రాంతాల్లో, వాకాడు, తడ, కోట, సూళ్లూరుపేట, చిల్లకూరులో వర్షం కురుస్తోంది.

### రేణిగుంట రన్ వేపై నీరు

తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రేణిగుంట రన్‌వేపైకి నీరు చేరింది. ల్యాండింగ్ సమస్య తలెత్తడంతో ఇండిగో విమానాన్ని చెన్నైకి దారి మళ్లించారు. ఈ విమానం హైదరాబాద్ నుంచి రేణిగుంట చేరాల్సి ఉంది.









విజయవాడలో బుధవారం నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, బోనెల విజయచంద్ర, తోయిక జగదీశ్వరి.

## డయేరియా మరణాలపై సీఎం ఆరా

విజయవాడ (చైతన్య రథం): విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో డయేరియాతో రెండురోజుల్లో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తన కార్యాలయ అధికారులతో మాట్లాడి సీఎం వివరాలు తెలుసుకున్నారు. నిన్న ఒక్కరోజే నలుగురు మృతిచెందారన్న సమాచారం నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. ఆ ప్రాంతంలో బాధితుల పరిస్థితి, వారికి అందుతున్న చికిత్స, గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### ఆలయ ధ్వంసంపై చర్యలకు ఆదేశం

అన్నమయ్య జిల్లా కదిరినాథునికోట లోని అటవీ ప్రాంతంలో అభయాంజనేయస్వామి ఆలయంపై దాడిని చంద్రబాబు ఖండించారు. దుండగుల దాడిలో ఆలయానికి నష్టం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## 18న ప్రజావేదిక రద్దు

అమరావతి (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తోన్న ప్రజావేదిక కార్యక్రమాన్ని 18న రద్దు చేసినట్లు కేంద్ర కార్యాలయ కార్యదర్శి, ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ.. శుక్రవారం తెలుగుదేశం పార్టీ శాసనసభ పక్ష సమావేశం కారణంగా ప్రజావేదిక కార్యక్రమం రద్దు చేశామన్నారు. ఆరోజు పార్టీ కార్యాలయంలో ఎటువంటి గ్రీవెన్స్, అర్జీలు తీసుకోరని, ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ప్రజలు గమనించాలని అశోక్‌బాబు విజ్ఞప్తి చేశారు.

## దూదిపింజెలైన దొంగ కేసులు!

# కడిగిన ముత్యంలా.. బాబు



అవినీతిరహితుడిగా, అభివృద్ధికాముకుడిగా లోకమెరిగిన చంద్రబాబుపై బురదజల్లటానికి జగన్‌రెడ్డి ఏళ్లతరబడి చేయని ప్రయత్నమంటూ లేదు. లక్షల కోట్ల అవినీతి కుంభకోణాన్ని కప్పెట్టడానికి.. ఎదుటివారికి అవినీతి బురద పూసే కుట్రలు చేయటంలో జగన్మోహన్‌రెడ్డి దిట్ట. షెల్ కంపెనీల ఏర్పాటుతో తన కంపెనీల్లోకి అవినీతి సొమ్ము మళ్లించుకున్న నేర చరిత్ర జగన్‌రెడ్డిది. క్విడ్ ప్రోకో ద్వారా రూ.43 వేల కోట్ల అవినీతికి పాల్పడి. 12 సీబీఐ కేసుల్లో పదేళ్లుగా బెయిల్ జీవితం గడుపుతున్న ఆర్థిక నేరగాడు 'జైల్ రెడ్డి" జగన్! జగన్‌రెడ్డి తన అవలక్షణాల్ని ఎదుటి వారికి అంటగట్టడంలో నేర్పరి. తన అవినీతి మకిలిని దాచటానికి... తప్పుడు ఆరోపణలతో దొంగ కేసుపెట్టి 52 రోజులు నిప్పులాంటి చంద్రబాబును జైల్లోపెట్టి వికృతానందం పొందాడు. జగన్‌రెడ్డి జమానాలో బనాయించిన దొంగకేసుల దూదిపింజెల్లా ఎగిరిపోయి.. అతని వికృత చేష్టలు బయటపడటంతో జీర్ణించుకోలేకపోతున్నాడు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసుల నుంచి చంద్రబాబు నిర్దోషిగా బయటపడటంతో జాతీయ మీడియా మొత్తం కథనాలు వండివార్చింది. '2023లో అప్పటి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిఐడి విచారణ ఆధారంగా 2023లో అరెస్టుకు దారితీసిన రూ.371 కోట్ల స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు మంగళవారం ఈడీనుంచి క్లీన్ చిట్ అందుకున్నారన్న' సారాంశాన్ని దుర్మార్గ వైసీపీ జీర్ణించుకోలేకపోతోంది.

### జగన్‌రెడ్డి రాజకీయ వికృతక్రీడ

యువతకు బంగారు భవిష్యత్తు కల్పించాలనే సదుద్దేశంతో 2014-2019లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం సీమెన్స్, డిజైన్ టెక్ సంస్థలతో కలిసి ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ట్రైపార్టీ అగ్రిమెంటు చేసుకున్నాయి. మొత్తం ప్రాజెక్ట్ వ్యయం రూ.3,281 కోట్లు. ఇందులో 90 శాతం వాటా సీమెన్స్ కంపెనీదే. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వాటా కేవలం 10 శాతమే. అంటే.. రూ.330 కోట్లు, జీఎస్టీ రూ.40 కోట్లు కలుపుకుని మొత్తం రూ.370 కోట్లు. ఒప్పందం ప్రకారం తాము పెట్టాల్సిన 90 శాతం పెట్టుబడికిగాను సిమెన్స్, డిజైన్ టెక్ 40 కేంద్రాలకు సంబంధించిన అన్నిరకాల సాఫ్ట్‌వేర్ మరియు అధునాతన పరికరాలను అందించాయి. దీనిపై స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు 40 కాలేజీల యాజమాన్యాలు లేఖలు రాస్తూ.. తమకు సిమెన్స్‌నుంచి అందిన పరికరాలు పనిచేస్తున్నాయని, తమ కేంద్రాలలో విద్యార్థులు సైతం మంచి శిక్షణ పొందుతున్నారని 2021 ఆగస్టులో సమాచారమిచ్చారు. ఈవిధంగా రాష్ట్రవ్యాప్తంగా కాకినాడ జెఎన్‌టీయు, విశాఖ ఏయూ, జీఎంఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కర్నూలు జి పుల్లారెడ్డి కాలేజీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలే కాదు, జగన్‌రెడ్డి సొంత జిల్లా కడపలోని ఇడుపులపాయ ఎస్టేట్‌కు అతిసమీపంలో ఉన్న ట్రిపుల్ ఐటీ సైతం తమ స్టాక్ రిజిస్టర్‌లను, లేఖలను స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అందించాయి. మొత్తం 2,94,000 మంది యువత శిక్షణ పొందితే, సుమారు 75 వేల ఉద్యోగాలు పొందటం అవినీతి ఎలా అవుతుందో -ఆర్థిక నేరగాడు జగన్‌రెడ్డే చెప్పాలి.

అయితే స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలకు పరికరాలు కోసం డిజైన్ టెక్ సంస్థ.. స్కిల్లర్ అనే మరో సంస్థతో ఒప్పందం చేసుకుంది. సదరు స్కిల్లర్ సంస్థ కొన్ని కంపెనీల వస్తువులు సేకరించే క్రమంలో తప్పుడు ఇన్‌వాయిస్‌లు సృష్టించి, జీఎస్టీ ఎగ్గొట్టిందనే ఆరోపణలు ఎదుర్కొంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్సెస్ (డీజీజీఐ) పన్ను ఎగవేతలకు సంబంధించి చేసిన దర్యాప్తులో డిజైన్ టెక్ కంపెనీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందడం కోసం, కొంతపన్ను ఎగవేశారని డీజీజీఐ పూణె కేసు ఫైల్ చేసింది. జీఎస్టీకి సంబంధించి రూ.7కోట్ల ట్యాక్స్ రిఫండ్స్ పొందడం కోసం డిజైన్ టెక్ కంపెనీ అవకతవకలకు పాల్పడినట్టు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ఏదో ఒక కంపెనీ వాళ్ల స్వలాభం కోసం పన్ను ఎగ్గొడితే, దానిని చంద్రబాబుకి, ప్రభుత్వానికి అన్వయించి.. భారీ కంభకోణం చోటుచేసుకున్నట్టు అసత్యాలతో నమ్మబలికాడు జగన్‌రెడ్డి. అది కేవలం పన్ను ఎగవేతకు సంబంధించిన అంశమని జీఎస్టీ డిపార్ట్‌మెంట్, ఈడీ సైతం ధృవీకరించాయి. పన్ను ఎగవేత అంశాన్ని భారీ కుంభకోణంగా చిత్రీకరించి.. లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న ప్రాజెక్టుకు గండికొట్టిన చరిత్రహీనుడు జగన్మోహన్ రెడ్డి. ఎటువంటి రాజకీయ దురుద్దేశం, కక్షపూరిత ధోరణి లేకుండా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న చంద్రబాబులాంటి దార్శనికునికి అవినీతి మచ్చ వేసి ఇబ్బందులకు గురి చేసి జగన్మోహన్ రెడ్డి రాక్షసానందం పొందాడు.

స్కిల్ ప్రాజెక్టులో మొత్తం రూ.3000 కోట్ల అవినీతి అని ప్రచారం చేశారు. తర్వాత రూ.371 కోట్లు అన్నారు, చివరికి టీడీపీ అకౌంట్‌కు వచ్చిన రూ.27 కోట్ల సభ్యత్వ రుసుమును చూపించి అవినీతి జరిగినట్టు ప్రచారం చేశారు. ఇలా ఆధారాలు లేని ఆరోపణలతో అవినీతి బురద బాబుకు అంటించడానికి శతవిధాలా ప్రయత్నించి.. దారుణంగా విఫలమయ్యాడు జగన్‌రెడ్డి. తాజాగా ఈడీ కార్యాలయం పన్ను ఎగవేత కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీమెన్స్ కంపెనీకి చెందిన రూ.23.54 కోట్ల విలువైన స్థిర, చర ఆస్తుల్ని అటాచ్ చేసింది.

ఇదే సమయంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేసు దర్యాప్తులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పాత్ర ఏదీ కనిపించలేదని ఈడీ స్పష్టం చేసింది. వినాయక్ ఖాన్వెల్కర్, సుమన్ బోస్ సహ పలువురు బోగస్ ఇన్‌వాయిస్‌లు సృష్టించి ఈ పనికి పాల్పడినట్లు గుర్తించమని ఈడీ తెలిపింది. చంద్రబాబుకు వ్యతిరేకంగా ఒక్క మాట కూడా ఈడీ ప్రకటనలో లేదు. మొత్తం వ్యవహారంలో చంద్రబాబుకు కానీ ఆయనకు సంబంధించిన వారికి డబ్బులు అందినట్లుగా ఎక్కడా చూపించలేదు.

'ఊరంతా ఒకదారి అయితే ఉలిపికట్టెది మరోదారి అన్నట్టు' అవినీతి సొమ్ముతో నడపబడుతున్న జగన్మోహన్‌రెడ్డి మానసపుత్రిక సాక్షిలో మాత్రం తప్పుడు ప్రచారం చేస్తూ. ఈడీ ట్వీట్‌ని వక్రీకరించి చట్టవిరుద్ధ రాతలు రాయడం సిగ్గుమాలిన తనం. తన అవినీతి బురదను నిప్పులాంటి చంద్రబాబుకు అంటించి జగన్ తన దోపిడిని, అవినీతిని కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నాడు.

అసలు స్కిల్ కేసు మొత్తం ఒక నికృష్ట రాజకీయ కుట్ర కాకపోతే, టెండర్ నిబంధనల ప్రకారం వస్తువులు, సేవలు ఆయా సంస్థల నుంచి అందినట్టు రికార్డులుంటే.. కళ్లుమూసుకుపోయిన జగన్మోహన్‌రెడ్డి గ్యాంగ్‌కి మాత్రం కనిపించటం లేదు.

పన్నుఎగవేతకు, డబ్బులు మింగేయడానికి తేడా కూడా తెలియకుండా నిందలు వేస్తున్నారు. అసలు పన్నుఎగవేతకు సంబంధించిన ఒక ప్రైవేట్ కంపెనీ స్కాంకి, ప్రభుత్వానికి సంబంధమేంటో జగన్‌రెడ్డి నోరు విప్పాలి.

అసలు ఈ లెక్కన, ఆరువేల కోట్ల రుణ సమీకరణకు ప్రయత్నాల్లో ఉన్న బైజూస్ సంస్థకు రూ.668 కోట్ల కాంట్రక్టు టెండర్ లేకుండానే అప్పటి జగన్ రెడ్డి ప్రభుత్వం ఆర్భాటంగా ఆన్లైన్ క్లాసెస్ నెపంతో ఒప్పందం చేసుకున్నారు. ఇదే బైజూస్ కంపెనీ దేశంమొత్తం మీద విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేసి నట్టేట ముంచి బోర్డు తిప్పేసింది. మరి బైజూస్ సంస్థ ఆర్థిక నేరానికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి కూడా సంబంధం ఉన్నట్టే కదా? సాక్షి రాతల ప్రకారం సీమెన్స్ ఒప్పందం నేరమైతే, బైజూస్ ఇంకా పెద్ద నేరం కాదా? కాదంటావా జగన్‌రెడ్డి?

- స్వరూప కొనవల,
అనలిస్ట్

# ఈశా ఫౌండేషన్ గ్రామోత్సవం అభినందనీయం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- క్రీడా వేడుకల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అమరావతి(చైతన్యరథం): ఈశా ఫౌండేషన్ 16వ గ్రామోత్సవం వేడుకలకు సంబం ధించిన గోడ పత్రికను సచివాలయంలోని రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి కార్యా లయంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈశా ఫౌండేషన్ వారు గ్రామోత్సవం అనే ప్రత్యేకమైన క్రీడా వేడుకను నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. క్రీడలు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని, వ్యసనాలు, అనారోగ్యకరమైన జీవనశైలి నుంచి ప్రజలను బయటకు తీసుకువస్తాయని తెలిపారు. క్రీడలు సామాజిక అవధులను దాటి అందరినీ ఒక్కటి చేసి సామరస్యాన్ని, ఆరోగ్యకరమైన పోటీని, ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామోత్సవం అంటే గ్రామం యొక్క పండగ.. దేశ జనాభాలో 75 శాతం గ్రామాలే ఉన్నా యన్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యం, సంక్షేమం, సమృద్ధి లక్ష్యంగా ఈశా ఈ కార్యక్రమం రూపొందించిందని తెలిపారు. 2004లో తమిళనాడులో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు 30,000 గ్రామాలలో వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ ఆటలలో 1,59,000 మందికి పైగా ఆటగాళ్లు, 13,350కి పైగా జట్లు, 28,350 మందికి పైగా గ్రామీణ మహిళలు ముఖ్యంగా గృహిణులు పాల్గొన్నారని తెలిపారు.



ఇందులో రిజిస్ట్రేషన్, ప్రవేశం కూడా ఉచితమని చెప్పారు. పోటీలను చూడడానికి వచ్చిన వారికి కూడా సరదా ఆటలు నిర్వహిస్తామని వివరించారు. ప్రతిఒక్కరినీ ఏదో ఒక ఆటలో పాల్గొనమని ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ క్రీడల వినోదాన్ని తిరిగి తీసుకురావడానికి, అంతరించిపోతున్న సాంప్రదాయ కళలను పునరుద్ధరించడానికి గ్రామం మొత్తాన్ని ఒక చోటికి చేర్చి వేడుకగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రిజిస్టర్ చేసుకోడానికి 8300030999 లేదా ఐఎస్‌హెచ్‌ఏ.సీవో/జీఆర్‌ఏఎంఓటీఎస్‌ఏవీఏఎం సందర్శించవచ్చని కోరారు. ఈ కార్యక్ర మంలో యువజన వ్యవహారాలు ముఖ్యకార్యదర్శి వినయ్‌చంద్, ఈశా ఫౌండేషన్ వాలంటీ ర్లు రాఘవ్ ముకుంద్, రాధిక జీవి, భరత్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌రెడ్డి పేరుచెప్పి

# బాకీ డబ్బు ఇవ్వకుండా బెదిరిస్తున్నారు

- ఇకపై అడిగితే చంపేస్తామంటున్నారని బాధితుల ఆవేదన
- రీ సర్వే జిమ్మిక్కులు.. మరొకరి పేరుపైకి మారిన ఆస్తులు
- భూమి రిజిస్ట్రేషన్ చేసుకోనివ్వకుండా వైసీపీ నేతల దౌర్జన్యం
- నెల్లూరు జిల్లాలో పొలాన్ని అన్యాక్రాంతం చేసిన అధికారులు



మంగళగిరి టీడీపీ కార్యాలయానికి ప్రజావినతులు

మంగళగిరి(చైతన్యరథం): ఇచ్చిన డబ్బులు అడిగితే వేమవరపు వరలక్ష్మి, ఆమె భర్త శ్రీనివాసరావు తమను బెదిరిస్తున్నారని పిల్లి విజయకుమారి, కొట్టె ఆదిలక్ష్మి మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ప్రజావినతుల కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. జగన్ రెడ్డి, సజ్జల, సుచరిత, నందిగామ సురేష్, విడదల రజనీలతో సాన్నిహిత్యం ఉందని చెబుతూ తమను భయపెడుతున్నారని, ఇకపై వారి ఇంటికి వెళ్లి డబ్బులు అడిగితే చంపే స్తామని కులం పేరుతూ నీచంగా దూషి స్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ప్రజా వినతుల కార్యక్రమంలో మాజీ మంత్రి జవహర్,పీలా గోవింద్ సత్యనారాయణ, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు స్వామి దాసు అర్జీ స్వీకరించి స్థానిక ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు.

– కోర్టు భూమి తమదే అని చెప్పినా వైసీపీ నాయకులు మునలప్ప కుమారులు నారాయణరెడ్డి, కృష్ణారెడ్డిలు తమ భూమి రిజిస్ట్రేషన్ చేసుకుంటుంటే బూతులు తిడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పుట్టపర్తికి చెందిన ఎం.వీరారెడ్డి ఫిర్యాదు చేశారు. వారి నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

– గతంలో రిజిస్టర్ అయిన తమ భూమిని నేడు చుక్కల భూమిగా చూపిస్తుండటం వల్ల పొలం అమ్ము కోలేకపోతున్నామని బాపట్ల జిల్లా పర్చూరుకు చెందిన శ్రీరాం వెంకట సుబ్బారావు విన్నవించారు. తాము అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే భూ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

– నెల్లూరుజిల్లా దస్తగిరి మండలం బాడుగుడిపాడు లో తమ తండ్రి కొనుగోలు చేసిన పొలాన్ని అధికారులే అన్యాక్రాంతం చేసి తమకు సంబంధం లేదంటున్నారని పర్చూరు మండలం ఉప్పుటూరుకు చెందిన శికాకొల్లి హైమనందకుమార్ ఫిర్యాదు చేశారు.తాము ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడం లేదని.. తమకు ఆ పొలమే ఆధారమని న్యాయం చేయాలని వేడుకున్నారు.

– బాపట్ల మండలం పూండ్ల గ్రామంలో 2013 నుంచి 2018 వరకు పలు అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు నేటికీ రాకపోవ డంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని, బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని ఆ ఊరి గ్రామ సర్పంచ్ నేతలకు అర్జీ ఇచ్చి వేడుకున్నాడు.

– కృష్ణా జిల్లా పామర్రు మండలం రిమ్మనపూడి గ్రామానికి చెందిన తుమ్మల హరిబాబు, తుమ్మల సత్యా నారాయణ సమస్యను వివరిస్తూ గత ప్రభుత్వం చేపట్టి న రీ సర్వే వల్ల తమ ఆస్తులు మరొకరికి మారాయని వాటిని సరిచేయాలని కోరారు.

– తాను, తన చెల్లి అనాథలమని.. తమ చదువుకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన మోదుగు తేజ వినతిపత్రం అందజేశాడు.

– కొండవీటి వాగు ఎత్తిపోతల పథకంలో భాగంగా ల్యాండ్ పూలింగ్‌లో ప్రభుత్వం తీసుకున్న భూమిని పలువురు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని.. వారిపై చర్యలు తీసుకోవాలని మంగళగిరి తాడేపల్లికి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశారు.

– ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఇసుకను ట్రాన్స్‌పోర్టు చేశామని, తనకు రావాల్సిన రూ.15 లక్షలు అడగ్గా ఇవ్వకుండానే అంతా సెటిల్ చేశామని చెబుతున్నారని తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన కొండేటి బాలాజీ ఆవేదన వ్యక్తం చేశారు. తాను దివ్యాంగుడినని, తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నాడు.





# ఎవడబ్బ సొమ్మని తాడేపల్లి కొంపకు ఇనుప కంచె

- రూ.12.85 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు
- వేలం వేసి ప్రజా సంక్షేమానికి ఉపయోగించాలి
- జగన్ ఐదేళ్లలో దోచుకున్న డబ్బంతా కక్కించాలి
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

మంగళగిరి(చైతన్యరథం): ఎవడబ్బ సొమ్మని జగన్‌రెడ్డి రూ.12.85 కోట్లతో ఇంటికి ఇనుప కంచె ఏర్పాటు చేసుకున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రశ్నించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ధనం జగన్ వాడుకున్నంత విచ్చలవిడిగా గతంలో ఏ ముఖ్య మంత్రి వాడి ఉండరని ధ్వజమెత్తారు. బిన్ లాడెన్, సద్దాం హుస్సేన్, అమెరికా అధ్యక్షులు కట్టుకున్నట్టు అభేద్యమైన ఐరన్ గడ్డర్‌తో తన ఇంటికి అంతటి సెక్యూరిటీతో కట్టుకోవాల్సిన అవసరం ఏమిటి? రూ.12.85 కోట్లు ప్రజాధనం ఖర్చుపెట్టి ఇంటికి రక్షణగా సెక్యూరిటీ గడ్డర్ కట్టుకోవడానికి ఎవరు అను మతించారో బయటపెట్టాలి.. ఏ అధికారి నిర్మించుకోమని రిపోర్టు ఇచ్చాడో వెల్లడిం చాలని కోరారు. మావోయిస్టులు, సెటిల్‌మెంట్ గ్యాంగ్, రిలీజియస్ గ్రూప్, ఐఎస్ఐ లాంటి ఏ గ్రూప్ నుంచి కూడా హాని లేనప్పుడు ఇంతటి రక్షణ జగన్ ఎందుకు ఏర్పాటు చేసుకున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి లోకేష్ చెప్పిన ట్లు జగన్ ఐదేళ్ల పాలనలో తిన్నదంతా కక్కిస్తామని స్పష్టం చేశారు. నిమ్మకూరులో ఉన్న బెల్ కంపెనీలో ప్రపంచదేశాల్లో యుద్ధాల్లో ఉపయోగించే ఆయుధాలు తయారు చేస్తారు.. వాళ్లకు కూడా ఇంతటి దుర్భేద్యమైన సెక్యూరిటీ గడ్డర్స్ లేవు. అలాంటప్పు డు జగన్‌కు ఎందుకు? అని ప్రశ్నించారు. అత్యంత విలువైన మణిమాణిక్యాలు జగన్ వద్ద ఏమైనా ఉన్నాయేమో..అందుకే ఇంతటి రక్షణ గడ్డర్లను ఏర్పాటు చేసుకున్నారే మోనని వ్యాఖ్యానించారు.

### ప్రజాధనం దుర్వినియోగం వాస్తవం కాదా?

జగన్ పెట్టుకున్న సలహాదారుల వల్ల రాష్ట్రానికి ఏమైనా మేలు జరిగిందేమో ఏ సలహాదారుడైనా చెప్పగలరా? పేదల సొమ్ముతో రక్షణ కవచం ఏర్పాటు చేసుకునేటప్పుడు పేదల డబ్బు నాకెందుకు అని జగన్‌కు అనిపించలేదెందు కు? దీన్ని బట్టి జగన్‌కు పేదలపై ఎంతటి ప్రేముందో అర్థమవుతుందన్నారు. దుర్మార్గపు ఆలోచనలతో ఐదేళ్లు పాలించి ఈ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసింది కాక రాష్ట్ర సలహాదారులుగా తగని వారిని నియమించుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిం ది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. జగన్



మానసపుత్రిక సాక్షిలో పనిచేసిన వారికి దోచిపెట్టినదంతా ఇప్పుడు కక్కించాలి. పోలవరం నిర్మాణానికి, రాజధాని నిర్మాణానికి ధనం అవసరం కనుక జగన్ సలహాదారులు, సాక్షి ఉద్యోగులు, సెక్యూ రిటీకి పెట్టిన ఖర్చు అంతా వసూలు చేయాలని కోరారు.

### దోచుకున్న డబ్బును కక్కించాలి

జగన్ ఐదేళ్లు తన ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. తానొక రాజుగా..కాలు తీసేయండంటే భటులు కాలు తీసేయడం, తల తీసేయండని చెబితే తల తీసే య డం, కట్టేసి కొరడాతో కొట్టండని చెబితే కొట్టడం వంటి ఆర్డర్లు వేయొచ్చని జగన్ భావించాడు. ప్రజాస్వామ్య పరిపాలన చేయాలని, రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని జగన్‌కు తెలియదు..జగన్ చదువుకున్నది కూడా అంతంతమాత్రమే. తాడేపల్లి ప్యా లెస్ ముందు తన ఇంటికి ప్రజలు ఎవరూ నడవకుండా ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు రహదారిని చంద్రబాబు వచ్చాక ప్రజా రహదారి చేశారు. తన ఇంటికి 40 అడుగుల ఎత్తు వరకు ఇనుప కంచె కట్టుకోవాల్సిన అవసరం జగన్‌కు ఎందుకొచ్చింది? రాజీవ్ గాంధీ ఇలాంటి కంచె ఏర్పాటు చేసుకుని ఉంటే బయటపడేవారు. ఉగ్రవాదుల నుంచి, టెర్రరిస్టుల నుంచి భయం ఉండే మోదీ, అమిత్ షాలకు కూడా ఇంతటి రక్షణ లేదు. జగన్‌రెడ్డి కోర్టులకు రెగ్యులర్‌గా హాజరై ఉంటే ఎప్పుడో జైలు జీవితానికే పరిమితమయ్యేవాడు. ఇన్నాళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకుని కోర్టుకు వెళ్లలేదు. పదవి పోయి నాలుగు నెలలైనా కోర్టుకు ఎందుకు వెళ్లడం లేదో అర్థం కావడంలేదు. కోర్టులు అతన్ని ఎందుకు పిలవడం లేదో కూడా అనుమానానికి తావిస్తోంది. కోర్టుకు ఆయన అవసరం లేదా? తెలిసిన వారు ఇందుకు సమాధానం చెప్పాలి. జగన్ ఇం టికి ఉన్న కంచెను వేలం వేసి వచ్చిన ధనాన్ని ప్రజా సంక్షేమానికి ఉపయోగించాలని కోరారు. అంతేకాక నిర్లజ్జగా, నిస్సిగ్గుగా ఉపయోగించుకున్న ప్రజల డబ్బును జగన్‌తో కక్కించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తిచేశారు.

చైతన్యరథం

# సహృదయంతో.. విరాళాలు

## అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు





అమరావతి (చైతన్య రథం): వరద బాధితులకు సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి పలువురు దాతలు విరాళాలు అందించి దాతృత్వం చాటుకుంటున్నారు. సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబు నాయుడుని కలిసి దాతలు చెక్కులు అందించారు. గుంటూరు జిల్లా క్వారీ అండ్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.16 లక్షలు, మాస్టర్ మైండ్స్ అకాడమీ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ కృష్ణ రూ.7 లక్షలు, శివశేఖర్ నాయుడు (ఎన్ఆర్ఐ న్యూజిలాండ్) రాజశేఖర్ రూ.2 లక్షలు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి రూ.2.6 లక్షలు, కళాధర్ ట్రావెల్స్ రూ.లక్ష, చెరుకూరి సీతారామయ్య రూ.లక్ష, మంత్రి గుమ్మడి సంధ్యారాణి ద్వారా సాలూరు డాక్టర్ల బృందం రూ.లక్ష, కంతేటి నిర్మల రూ.లక్ష, వాదాద గణేశ్వరరావు రూ.లక్ష, శుభం డెవలపర్స్ రూ.లక్ష విరాళాలుగా అందించారు. గుజ్జర్ల పూడి రాజ్యలక్ష్మి రూ.లక్ష, గుజ్జర్లపూడి వేంకటేశ్వర రావు రూ.లక్ష, బిల్లా రాజారావు రూ.71 వేలు, కాపూరి దాసు రూ.50 వేలు, దీప్తి ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.40 వేలు, రామకృష్ణప్రసాద్ పాలేటి రూ.10 వేలు, గూదూరి పెద్ద అంజనేయులు రూ.25 వేలు విరాళాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించారు. వీరిని సీఎం చంద్రబాబు అభినందించారు.













- కొండమోడు -పేరేచర్ల ఎన్‌హెచ్‌కు రూ.881.61 కోట్లు
- కేంద్రానికి ధన్యవాదాలు తెలిపిన ఎంపీ లావు

# పల్నాడుకు మరో మహారోడ్డు

పల్నాడు(చైతన్యరథం): పల్నాడుజిల్లాలో కేంద్రం మరో మహారోడ్డు నిర్మాణానికి రూ.881.61 కోట్లు మంజూరు చేసినట్టు నరసరావుపేట ఎంపీ, పార్లమెంట్ టీడీపీ పక్ష నాయకుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు వెల్లడించారు. బుధవారం ఉదయం ఢిల్లీలో మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని కొండమోడు -పేరేచర్ల జాతీయ రహదారికి కేంద్ర రవాణా రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ నిధులు మంజూరుచేశారన్నారు. ఈ రహదారిని కేంద్ర ప్రభుత్వంలోని భారత్ మాలా ప్రాజెక్టు నుండి ఎన్‌హెచ్(ఓ) కిందకు మార్చి నిధులు మంజూరు చేశారన్నారు. ఈరోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎన్నో ఏళ్ళుగా ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు. ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య హయాంనుంచీ రోడ్డు నిర్మాణం త్వరలోనే అనే ప్రచారం సాగింది, కానీ కార్యరూపం దాల్చలేదు, ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు ఈ రోడ్డు నిర్మాణం విషయంలో కేంద్రంతో పలుమార్లు చర్చించి పట్టుబట్టారు. శ్రీకృష్ణ దేవరాయలు కృషితోనే జాతీయ రహదారిగా గుర్తింపు పొందిన ఈ రహదారికి ఇప్పుడు మంత్రి నితిన్ గడ్కరీ నిధులు మంజూరు చేశారు. మొత్తం 49.917 కి.మీ దూరంమున్న 4 లైన్ల జాతీయ రహదారికి రూ.881.61 కోట్లతో పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఎంపీ వెల్లడించారు. ఈ జాతీయ రహదారికి అనుబంధంగా సత్తెనపల్లి, మేడికొండురుల వద్ద బైపాస్ రోడ్లు నిర్మించనున్నారు.



# బీసీల పాలిట దేవుడు చంద్రన్న.. ద్రోహి జగన్‌రెడ్డి

## బీసీ రక్షణ చట్టం తెచ్చి హామీ నిలబెట్టుకున్న చంద్రబాబు



నాడు బీసీల్లో రాజకీయంగా చైతన్యం తెచ్చి వారిని వెన్నుతట్టి ప్రోత్సహించారు ఎన్టీఆర్. ఆ కారణంగానే తెలుగుదేశం బీసీల పార్టీగా ముద్ర పడింది. తర్వాత చంద్రబాబు బీసీల సంక్షేమాన్ని కొనసాగించారు. రాజకీయంగానూ ప్రాధాన్యం కల్పించారు. సబ్‌ప్లాన్, కార్పొ రేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు, చట్టసభల్లో రిజర్వేషన్ల పెంపు, సంక్షేమ పథకాలు, నామి నేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించి వారి పాలిట దేవుడయ్యాడు. నేడు బీసీ రక్షణ చట్టం తెచ్చి ఇచ్చిన హామీకి నిలబెట్టుకుని బీసీల రక్షకుడిగా నిలిచారు. ఐదేళ్ల అరాచక పాలనలో జగన్‌రెడ్డి బీసీలపై ఉక్కుపాదం మోపి వారిని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అణచివేసి వారి పాలిట కంటకుడిగా, ద్రోహిగా మారాడు.

### బీసీల శవాలపై జగన్ కుటుంబం వైభోగం

చంద్రబాబు 2014-19 మధ్య బీసీ సబ్‌ప్లాన్‌కు నిధులు కేటాయించి కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేయించారు. రూ.75 వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధుల ను దారి మళ్లించాడు బీసీల ద్రోహి జగన్‌రెడ్డి. స్థానిక సంస్థల్లో ఎన్టీఆర్, చంద్రబాబు ఇచ్చిన రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి కుదించి 16,800 రాజ్యాంగబద్ధ పదవులు దూరం చేశారు. బీసీల నుంచి 8 వేల ఎకరాల అసైన్డ్ భూములను బలవంతంగా లాక్కున్నారు. విదేశీ విద్య, స్టడీ సర్కిల్స్, స్కిల్ డెవలప్‌మెంట్, విద్యా పథకాలు, ఆదరణ లాంటి ఆర్థికాభివృద్ధి పథకాలు సహా 30 బీసీ పథకాలు రద్దు చేశారు. 56 కార్పొరేషన్లు పెట్టినా రూపాయి కేటాయించకుండా కార్పొరేషన్లను ఉత్సవ విగ్రహాలుగా మార్చారు. 13 బీసీ భవనాలు, 1187 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను నిలిపివేశారు. ఇక ఐదేళ్ల అరాచక పాలనలో బీసీలపై నేరాలకు అడ్డే లేకుండా పోయింది. 26 మంది బీసీల హత్యలు జరిగా యి. 750 మందిపై తప్పుడు కేసులు పెట్టారు. 2500 మంది బీసీలపై దాడులకు పాల్ప డ్డారు. నాడు బీసీ పారిశ్రామికవేత్త జింకా వెంకట నరసయ్య హత్య, ఆ తర్వాత ఆయనకు చెందిన బైరైటీస్ గనిని దురాక్రమణ చేసిన తర్వాతే నాడు వైఎస్ కుటుంబం రాజకీయ ఎదుగుదలకు బీజం పడింది. తర్వాత కాంగ్రెస్ పాలనలో వైఎస్సార్, తన ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి బీసీల అణచివేతకు పాల్పడ్డారు. వారి హయాంలో బీసీలపై జరిగిన నేరాలకు లెక్కే లేదు.

### సొంత సామాజికవర్గానికే పదవులు

పారిశ్రామిక రాయితీలు అందించకుండా బీసీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగనీయ కుండా జగన్‌రెడ్డి అణగదొక్కాడు. చేతివృత్తుల వారికి 90 శాతం సబ్సిడీతో పనిముట్లు అం దించే ఆదరణ పథకాన్ని దూరం చేశాడు. 16 యూనివర్శిటీలలో వైస్ ఛాన్సలర్లలో 10 మంది సీఎం సొంత సామాజికవర్గం వారే. అదే చంద్రబాబు హయాంలో తొమ్మిది యూనివ ర్శిటీలకు వైస్ ఛాన్సలర్లుగా బీసీలనే నియమించారు. చంద్రబాబు హయాంలో ఏపీఐఐసీ, టీటీడీ, తుడా వంటి రాష్ట్రస్థాయిలో ప్రముఖ సంస్థలకు చైర్మన్లుగా బీసీలను నియమిస్తే.. జగన్‌రెడ్డి మాత్రం అన్నింటినీ సొంత వారితో నింపుకున్నారు. అంతేకాకుండా వెయ్యికి పైగా నామినేటెడ్ పదవుల్లో ఒక శాతం కూడా కేటాయించలేదు. కొద్దిమంది బీసీలకు పదవులిచ్చి వారికి వ్యక్తిగతంగా లబ్ధి చేకూర్చి బీసీ సామాజికవర్గాల్లోని సుమారు 2.41 కోట్ల మందిని నిలువు దోపిడీ చేసి ఆ సామాజికవర్గాన్ని అణచివేశారు.

### ఐదేళ్ల అరాచక పాలనలో బీసీల హత్యలు

జగన్‌రెడ్డి సీఎంగా 2019-2024 మధ్య 22 మంది బీసీ సామాజికవర్గానికి చెందిన వారు హత్యకు గురయ్యారు. బీసీలపై దాడులతో అరాచకం సృష్టించారు. టీడీపీ బీసీ నేత లపై కక్ష సాధింపు లక్ష్యంగా అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేశారు. అస లు సంబంధమే లేకుండా అట్రాసిటీ, అత్యాచారం కేసులు పెట్టారు.

| జిల్లా | బీసీల హత్యలు |
|---|---|
| గుంటూరు | 4 |
| అనంతపురం | 3 |
| విజయనగరం | 2 |
| కడప | 2 |
| నెల్లూరు | 2 |
| కృష్ణ | 2 |
| పల్నాడు | 1 |
| బాపట్ల | 1 |
| పల్నాడు | 1 |
| శ్రీకాళహస్తి | 1 |
| ప్రకాశం | 1 |
| చిత్తూరు | 1 |
| కర్నూలు | 1 |

### బీసీల బాంధవుడు చంద్రబాబు

1975లో సామాజిక సంక్షేమ శాఖ విభజన జరిగింది. సామాజిక సంక్షేమ శాఖ నుంచి బీసీ సంక్షేమాన్ని విభజించి ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేశారు. అయితే 1994లో టీడీపీ ప్రభుత్వం వచ్చాకే ప్రత్యేక శాఖకు చట్టబద్ధత కల్పించారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు:** ఎన్టీఆర్ 1987లో మొట్టమొదటిసారిగా బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు తీసుకొస్తే.. వాటిని చంద్రబాబు 34 శాతానికి పెంచి గ్రామస్థాయిలో రాజకీయ అవకాశాలు కల్పించారు. జగన్ రెడ్డి 24 శాతానికి తగ్గించి 16,800 రాజ్యాంగబద్ధ పదవులు దూరం చేశాడు.

**ఆదరణ పథకం:** టీడీపీ హయాంలో చేతి వృత్తులపై ఆధారపడిన 124 కుల వృత్తుల వారికి రూ.964 కోట్ల వ్యయంతో 341 రకాల పనిముట్లను 90 శాతం సబ్సిడీతో అందించి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకున్నారు. రూ.10 వేల నుంచి రూ.30 వేలు విలువ చేసే ఆధునిక పనిముట్లు అందించారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పరిక రాలను పంపిణీ చేయకపోగా లబ్ధిదారుల వాటాగా చెల్లించిన రూ.47 కోట్లను సైతం స్వాహా చేశారు.

**బీసీ కార్పొరేషన్ల రుణాలు:** 2014-19 టీడీపీ పాలనలో ఐదేళ్లలో 4,24,832 లక్షల మందికి రూ.3674 కోట్లతో స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేసి సొంత కాళ్లపై నిలబడేలా ప్రోత్సహించారు.

**విదేశీ విద్య:** 1975 మంది బీసీ విద్యార్థులను విదేశీ విద్య పథకం కింద విదేశాల్లో చదివించారు.

**బీసీ కులగణన:** జనగణనలో బీసీల కులగణన చేయాలంటూ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 2014 సెప్టెంబరు 6న జనగణనతో పాటుగా చట్టసభల్లో రిజర్వేషన్, కేంద్రంలో మంత్రిత్వ శాఖ, పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు.

**నామినేటెడ్ పదవులు:** టీటీడీ చైర్మన్‌గా పుట్టా సుధాకర్ యాదవ్, ఏపీఐఐసీ చైర్మన్‌గా పి.కృష్ణయ్య యాదవ్, తుడా చైర్మన్‌గా నరసింహయాదవ్ సహా 80 ప్రతిష్టాత్మక సంస్థలు, మరో 30 ప్రభుత్వ సలహాదారుల పోస్టుల్లో క్యాబినెట్ హోదా కలిగిన సంస్థలకు చైర్మన్లుగా బీసీలను నియమించారు.

**రాజకీయ పదవుల్లో ప్రాధాన్యం :** ఎన్టీఆర్ 1987లో మొట్టమొదటిసారిగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు తీసుకొస్తే వాటిని చంద్రబాబు 34 శాతానికి పెంచి గ్రామస్థాయిలో రాజకీయ అవకాశాలు కల్పించారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక దానిని 24 శాతానికి తగ్గించి 16,800 రాజ్యాంగబద్ధ పదవులకు దూరం చేశాడు.

**కార్పొరేషన్లతో స్వయం ఉపాధి:** బీసీ కార్పొరేషన్ల ద్వారా చంద్రన్న ఐదేళ్లలో 4,24,832 లక్షల మందికి రూ.3674 కోట్లు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేశారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు మంజూరు చేసినవి కూడా రద్దు చేశారు. బ్యాంకుల్లో ఉన్న రూ.200 కోట్లను వెనక్కి లాక్కున్నాడు. బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లను నియమించామని చెప్పుకుంటున్న జగన్‌రెడ్డి కార్పొరేషన్ల ద్వారా ఐదేళ్లలో ఒక్క యూనిట్ రుణం కూడా మంజూరు చేయలేదు.

**చేతివృత్తులకు అండగా చంద్రబాబు:** నాయీబ్రాహ్మణులకు, మత్స్యకారులకు, చేనేతలకు తదితర చేతివృత్తులకు అండగా నిలిచేందుకు చంద్రబాబు హయాంలో వారికి నిధులు కేటాయించారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ సబ్‌ప్లాన్ నిధులు రూ.75,760 కోట్లు దారి మళ్లించారు.(అది కూడా 2021 వరకే..)

**బీసీ రక్షణ చట్టం:** జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో బీసీలపై ఉక్కుపాదం మోపాడు. వారిపై నేరాలు, ఘోరాలతో రక్షణ కరువైంది. కూటమి ప్రభుత్వంలో వారికి రక్షణ కల్పించేందుకు ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు.

- సాయికల్యాణ్,
అనలిస్ట్

# తిరుమలలో అలెర్ట్

- భక్తులకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు
- భారీ వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు
- నేడు శ్రీవారి మెట్టు నడక మార్గం మూసివేత
- టీటీడీ ఈఓ జె.శ్యామలరావు వెల్లడి

తిరుమల (చైతన్య రథం): భారీ వర్షాల కారణంగా వాతావరణ పరిస్థితులు దృష్ట్యా తిరుమలకు వెళ్లే శ్రీవారి మెట్టు నడక మార్గాన్ని గురువారం వరకూ మూసివేయాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. భారీ నుండి అతి భారీ వర్షాలు పడతాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో టీటీడీ ఈఓ జె.శ్యామలరావు బుధవారం టీటీడీ ఉన్నతాధికారులతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విపత్తుల నిర్వహణ ప్రణాళికపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భారీ వర్షాల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు.

కొండ చరియలపై ప్రత్యేక నిఘా ఉంచి ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్‌కు అంతరాయం కలకగకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ శాఖ ముందస్తు జాగ్రత్తగా జనరేటర్ల కొరకు డీజిల్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఐటీ వింగ్ భక్తుల దర్శనాలు, వసతి, ప్రసాదంవంటి కార్యాకలాపాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయం చూసుకోవాలన్నారు.

వైద్యశాఖ అంబులెన్సులను అందుబాటులో పెట్టుకుని సిబ్బందితో అప్రమత్తంగా ఉంధాలన్నారు. ఇంజనీరింగ్ విభాగం డ్యామ్ గేట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఘాట్ రోడ్లలో జేసీబీలను సిద్ధంగా ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు ఇంజినీరింగ్ సిబ్బందితో సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైతే అగ్ని మాపక సిబ్బంది వేగంగా స్పందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజా సంబంధాల విభాగం వాతావరణ సమాచారాన్ని తెలుసుకుంటూ ఎస్వీబీసీ, సోషియల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తూ భక్తులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఇప్పటికే పాపవినాశనం, శిలాతోరణం మార్గాలను టీటీడీ మూసివేసింది. వాతావరణ పరిస్థితులను బట్టి ఈ మార్గాల్లో రాకపోకలను టీటీడీ పునరుద్ధరించనుంది. సమావేశంలో టీటీడీ అడిషనల్ ఈఓ. సి.హెచ్.వెంకయ్య చౌదరి, టీటీడీ జేఈఓ గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సిఈ సత్యనారాయణ ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

# జగన్ ద్రోహానికి యువత బదులు చెప్పే సమయం వచ్చింది

◆టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ, ఆలపాటి, మక్కెన, ఏఎస్ రామకృష్ణ



వినుకొండ (చైతన్యరథం): దోపిడీ తప్ప ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, వారి ఆకాంక్షలేమాత్రం పట్టకుండా జగన్ చేసిన ద్రోహానికి యువత బదులు తీర్చుకునే సమయం వచ్చిందని టీడీపీ నేతలు వ్యాఖ్యానించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రూపంలోవచ్చిన అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుని మళ్లీ వైసీపీని లేవకుండా చేయాలని వారంతా పిలుపునిచ్చారు. వినుకొండలోని తిమ్మాయపాలెం రోడ్డులో ఉన్న వై కన్వెన్షన్ హాల్‌లో బుధవారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం, ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ... ఆనాడు జగన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే నియంత, అవినీతి పాలన మాకు వద్దని యువత ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు ఎన్నికలు జరిగిన 3 ఎమ్మెల్సీ స్థానాల్లో తెదేపా అభ్యర్థులను గెలిపించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు ఆనాడే పునాది పడిందన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా అలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేస్తున్నారని, భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తొలి ప్రాధాన్యతగా పట్టభద్రుల ఓట్లను చేర్పించడమేనని, తర్వాత పార్టీ సభ్యత్వాలు చేయిద్దామని అన్నారు. యువత ఐదేళ్ల వైసీపీ పాలన గుర్తుతెచ్చుకోవాలని కోరారు. యువతను నిర్వీర్యం చేసి, గంజాయి రాష్ట్రంగా, మహిళలపై అత్యాచారాలు, ప్రతిపక్ష నేతను గొంతునొక్కే కార్యక్రమం, ఆఖరికి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించే పాలన ఇచ్చారన్నారు. నైపుణ్యాభివృద్ధి కేసులో ఎవరో ఆస్తులు అటాచ్ చేస్తే సీఎం చంద్రబాబుకు ఏం సంబంధమని, మళ్లీ జైలుకు వెళ్తారంటూ మసిపూసి మారేడుకాయలా మొసలికన్నీళ్లు కార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు నెలల కూటమి పాలనలో ప్రజలంతా చాలా సంతోషంగా ఉన్నారని, వారితోపాటు ఉద్యోగులు కూడా ఒకటో తేదీనే జీతాలు తీసుకుంటూ సంతోషంగా ఉన్నారన్నారు. ముఖ్యంగా పట్టభద్రులకు సంబంధించి మెగా డీఎస్సీ ప్రకటించారని, మంత్రి లోకేష్ విదేశాల్లో పర్యటనలు చేస్తూ రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. విద్యావంతుడు, పాలనలో మంచి అనుభవం ఉన్న ఆలపాటి రాజాను గెలిపించుకుంటే వినుకొండ నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు సమస్య వచ్చినప్పుడు ఎమ్మెల్యే జీవీతో పాటు మంచి అనుభవం ఉన్న నాయకుడిని గెలిపించుకుంటే తోడ్పాటుగా ఉంటుందన్నారు. ఇక్కడ 10 వేల పట్టభద్రుల ఓట్లు ఉంటాయని, ప్రతి ఇంట్లో ఒక పట్టభద్రుడు ఉన్నారని, వారందరిని ఓటర్లుగా చేర్చి ఓటు వేయించే బాధ్యత కూటమి శ్రేణులదే అని చెప్పారు. 90 శాతం ఓట్లు ఆలపాటి రాజాకే పడతాయన్నారు. వైకాపా పాలనలో రాష్ట్రానికి అణుబాంబు వేసినంత నష్టం జరిగిందని టీడీపీ నేతలు మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా కూటమి గెలిచి తీరాలన్నారు. తద్వారా 2029లో మళ్లీ కూటమే వస్తుందనే నమ్మకం కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వానికి ఒక కానుకగా ఆలపాటి రాజాకు అద్భుతమైన విజయాన్ని మనం ఇవ్వాలన్నారు.



# పేదల ఇళ్ల నిర్మాణంలో అంతులేని అవినీతి

◆జగనన్న కాలనీలు సరే... ఆ ఇళ్లలోకి పోవడానికి ప్రజలకు ఈత నేర్పించాలి కదా

◆కాకాణి అవినీతిపై టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫైర్

సర్వేపల్లి (చైతన్యరథం): పేదల ఇళ్ల నిర్మాణంలో వైసీపీ ప్రభుత్వం అంతులేని అవినీతికి పాల్పడిందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక మోస్తారు వర్షానికే పరిస్థితి ఇలా ఉంటే వర్షాలు ఎక్కువతే ఎలా ఉంటుందో చెప్పలేమని వ్యాఖ్యానించారు. బుధవారం నియోజకవర్గంలోని వెంకటాచలంలోని జగనన్న కాలనీ పేరుతో నిర్మించిన ఇళ్ల ప్రాంతాన్ని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జగనన్న కాలనీల పేరుతో వైసీపీ ప్రభుత్వం పేదలను మోసం చేసిందని, కాలనీల పేరుతో వైసీపీ నాయకుడు కాకాణి గోవర్ధన్ అతని బ్యాచ్ కోట్ల రూపాయాలు దోచుకున్నారని అన్నారు. అత్యంత నాసిరకంగా కట్టిన ఇళ్ల దుస్థితిని చూస్తే ఆవేదన కలుగుతోందని, రోడ్లపై ఎక్కడికక్కడ నీళ్లు నిలిచిపోవడంతో పాటు కాలనీలు అత్యంత మురికి కూపాలుగా మారిపోయాయన్నారు. ప్రమాణాల కంటే అత్యంత దారుణంగా నిర్మాణాలు చేపట్టారని, శ్లాబు మందం తగ్గిపోవడంతో పాటు... స్టీల్ రాడ్ల ఏర్పాటులోనూ వైసీపీ నాయకులు చేతివాటం ప్రదర్శించారని అన్నారు. ఇంటి నిర్మాణంలో కీలకమైన పునాదుల నిర్మాణంలోనూ అంతా మోసమే చేశారని, పార్టీషియన్ వాల్ నిర్మాణంలోనూ వెడల్పు తగ్గించారని అన్నారు. కాలనీల పేరుతో కోట్లు గడించిన కాకాణి అండ్ బ్యాచ్ ఒక్కసారి ఈ ఇళ్ల మరుగుదొడ్డిలోకి వెళ్లగలరా? అని ప్రశ్నించారు. పేదలంటే అంత అలుసా? ఇంత దారుణమైన వ్యక్తులను తాను ఎప్పుడూ చూడలేదని, ఒక్క ఈ కాలనీలోనే రూ.20.50 లక్షలతో మట్టి తోలినట్టు బిల్లులు చేసుకున్నారని, ఒక్కో లబ్ధిదారుడి వద్ద ఇంటికి రూ.40 వేల వరకు అదనంగా గుంజుకున్నారని ధ్వజమెత్తారు. చివరకు మరుగుదొడ్ల నిర్మాణాల్లో సైతం అవినీతికి పాల్పడ్డారని, నాలుగైదు అడుగుల ఎత్తులోనే మరుగుదొడ్డి నిర్మించడం దుర్మార్గమన్నారు. ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవినీతిని ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్లామని, ఈ విషయంలో విజిలెన్స్ విచారణ జరుగుతోందని త్వరలోనే అన్ని విషయాలు బయటకు వస్తాయని అన్నారు. పేదల ఇళ్ల పేరుతో దోచుకున్న కోట్ల రూపాయాలను వసూల్ చేస్తామని, తప్పుడు పనులు చేసిన వారిని ఖచ్చితంగా శిక్షించి తీరతామన్నారు.

# శంకర్ విలాస్ ఆర్వోబికి అధికారిక ఆమోదం

◆ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

◆సేతు బంధన్ పథకం కింద మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటన



గుంటూరు (చైతన్యరథం): శంకర్ విలాస్ వంతెన నాలుగు లైన్ల విస్తరణ - ఆర్.ఓ.బి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సిఆర్ఐఎఫ్ పథకం కింద సేతు బంధన్ పథకం ద్వారా గుంటూరు - నల్లపాడు రైల్వే సెక్షన్ పరిధిలోని శంకర్ విలాస్ ఆర్వోబి నిర్మాణానికి రూ.98 కోట్లను మంజూరు చేస్తున్నట్లుగా ఆదేశాలను బుధవారం జారీ చేసింది. ఏపీ రోడ్, ట్రాన్స్ పోర్ట్ అండ్ బిల్డింగ్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండేకు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సందీప్ కుమార్ సింగ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. దీంతో గుంటూరు పార్లమెంటు పరిధిలోని ప్రజల్లో ఆనందోత్సాహాలు మిన్నంటుతున్నాయి. మరో 3 - 4 రోజుల్లో వెలువడుతుందనుకున్న జీ.వో ముందుగానే రావడంతో గుంటూరు ప్రజలు ఆనందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తన అధికారికంగా ప్రకటనను విడుదల చేయడం పట్ల గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలియజేశారు. గుంటూరు, అమరావతి అభివృద్ధి కోసం పాటుపడే కూటమి ప్రభుత్వానికి మాత్రమే ఈ తరహా విజయాలు సాధ్యమని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఏపీ అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. పార్లమెంట్ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు.

# వైసీపీ రౌడీల ఆగడాలను సహించేది లేదు

◆శాసనసభ్యులు వనమాడి కొండబాబు



కాకినాడ (చైతన్యరథం): ప్రజలు వైసీపీని చీకొట్టి తరిమికొట్టిన వైసీపీగుండాల రౌడీలలో మార్పు రాలేదని, వైసీపీ రౌడీల గుండాల ఆగడాలను సహించేది లేదని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు వ్యాఖ్యానించారు. దుమ్ములపేట ప్రాంతానికి చెందిన తెలుగుదేశంపార్టీ నాయకులు సీరం చిన్నా, కోంద్రు తాతారావులపై వైసీపీ నాయకులు మారణాయులతో అర్ధరాత్రి దాడి చేయడంతో గవర్నమెంట్ జనరల్ హాస్పటల్ నందు చికిత్స పొందుతున్న క్షతగాత్రులను బుధవారం వనమాడి కొండబాబు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ... గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకినాడ నగరాన్ని గుండాలు రౌడీలు పాలనగా తయారు చేశారని, ప్రభుత్వం మారిన వారిలో గూండాల సంస్కృతి మారలేదన్నారు. సోషల్ మీడియాలో తెలుగుదేశం పార్టీ సమాచారాన్ని పోస్ట్ చేస్తున్నారని సీరం చిన్న, కోంద్రు తాతరావులపై గత వైసీపీ ప్రభుత్వం అనేక అక్రమ కేసులు బనాయించి వేధించడం దుర్మార్గమన్నారు. జగన్‌రెడ్డి గత పాలనలో చేసిన ఆగడాలను అక్రమాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని కక్షగట్టి అర్ధరాత్రి సమయంలో వైసీపీ గూండాలు దాడులకు పాల్పడ్డారని అన్నారు. బాధితులు సీరం చిన్న కొంద్రు, తాతారావుల తలకు తీవ్ర గాయాలయ్యాయని, కాకినాడ నగరంలో హత్య రాజకీయాలకు ప్రేరేపిస్తున్న వైసీపీ నాయకులపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, మూగు రాజు, చోడిపిల్లి సతీష్, ఏరిపిల్లి రాము, కోమటి మసేనమ్మ, కోమటి నూకరాజు, చోడిపిల్లి ప్రేమనందం, ఎరిపిల్లి సత్తిబాబు, అర్జల్ల దాసు, తిరిది ఎల్లయ్యమ్మ, దూడపావని, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

◆అత్యవసరమైతే తప్పా బయటకు రావొద్దు

◆నగర ప్రజలకు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సూచన

నెల్లూరు (చైతన్యరథం) : నగరంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఏ అవసరమొచ్చినా తమను సంప్రదిస్తే వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు దగ్గరుండి చేపడతామని, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దు అని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు సూచించారు. బుధవారం నగరంలోని 47వ వార్డులోని రాజేంద్రనగర్, కుక్కలగుంట, ఉయ్యాల కాలువ తదితర ప్రాంతాల్లో స్థానిక టీడీపీ నేతలతో కలిసి సుబ్బారావు పర్యటించారు. జోరు వర్షంలోనూ కాలనీల్లోని పల్లపు ప్రాంతాలు, మురుగు నీరు ప్రవహించే కాలువలను పరిశీలించారు. ఎక్కెడెక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. నెల్లూరు నగరంలో గత రెండు రోజుల నుంచి భారీగా వర్షాలు కురుస్తున్నాయని వరద నీరు దిగువకు సాఫీగా వెళ్లేందుకు పారిశుద్ధ్యం పనులు చేపట్టామని తెలిపారు.

# పల్లె పండుగ ద్వారా పల్లెలకు పూర్వ వైభవం

◆గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం (చైతన్యరథం): పల్లెలకు పూర్వవైభవం తెచ్చేందుకే పల్లె పండుగ పేరుతో కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని గన్నవరం నియోజకవర్గం యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలంలోని సిరివాడ గ్రామంలో రూ. 20లక్షల వ్యయంతో నిర్మించనున్న 300 మీటర్ల సీసీ రోడ్, అరుగొలను గ్రామంలో రూ.19 లక్షల వ్యయంతో నిర్మించనున్న 2 సీసీ రోడ్లకు, కానుమోలు గ్రామంలో రూ.23లక్షల వ్యయంతో నిర్మించనున్న 415 మీటర్ల సీసీ రోడ్డుకు, పెరికీడు గ్రామంలో రూ.14లక్షల వ్యయంతో నిర్మించనున్న 237 మీటర్ల సీసీ రోడ్డుకు, కొయ్యూరు గ్రామంలో రూ.13లక్షల వ్యయంతో నిర్మించనున్న 200 మీటర్ల సీసీ రోడ్డుకు, బొమ్ములూరు గ్రామంలో రూ.8.50లక్షల వ్యయంతో నిర్మించనున్న 139 మీటర్ల సీసీ రోడ్డుకు, బాపులపాడు గ్రామంలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించనున్న 4 సీసీ రోడ్లకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు . ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'పల్లె పండుగ' కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4500 కోట్ల రూపాయలతో 30 వేల అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామాభివృద్ధి ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామాలలో త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజ్, వంటి మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించి, పల్లెసీమలను ప్రగతి సీమలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గన్నవరం అధ్యక్షులు చలమలశెట్టి రమేష్, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, మండల కార్యదర్శి పుట్టా సురేష్, స్థానిక నాయకులు మాదల శ్రీను, ఎరాబోయిన కుమారస్వామి, కొండలరావు, మండల అప్పారావు, సుందర్ కుమార్, గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, తుమ్మల బ్రహ్మాజీ బేత శేషు కుమార్, మూల్పూరి వెంకటరత్నం, చింతల అప్పారావు, దుర్గారావు, చెడుగుండి శివశంకర్, వేగిరెడ్డి పాపారావు, బేతాళ ప్రమీలారాణి, సుబ్బారావు, ఆంజనేయులు, కొల్లు వీర వెంకట సత్యనారాయణ, తూమాటి సాంబశివరావు , కృష్ణారావు , కాటూరి విజయభాస్కర్, కొల్లి చందు, నితీష్ కుమార్, ప్రసాద్ , చిన్నాల చిన్న, దుట్టా శివన్నారాయణ, శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి

◆రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

అమరావతి (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృధి కోసం నిధులు కేటాయించండని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి పయ్యావుల కేశవ్‌తో ఎమ్మెల్యే మాధవి భేటి అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను మంత్రికి వివరించారు. సమస్యల పరిష్కారానికి నిధుల సమస్య అడ్డంకిగా మారిందని, రాజధాని ప్రాంత నగరమైన గుంటూరులో కనీస మౌలిక సదుపాయాలు కల్పన కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరగా, మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించారని మాధవి తెలిపారు.

**ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం: మాధవి**

ప్రజలకు అండగా ఉండి, వారికి జవాబుదారితనంతో ఉండే ఏకైక ప్రభుత్వం ఎన్డియే కూటమి ప్రభుత్వమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొనారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజల నుండి ఆమె వినతులు స్వీకరించారు. పలు సమస్యలపై వచ్చిన వారిందరి సమస్యలు అడిగి తెలుసుకున్న ఆమె... ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మాధవి తెలిపారు.

## జోరు వర్షంలో సహాయక చర్యలు చేపట్టిన బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి (చైతన్యరథం): నియోజకవర్గంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న ఆయా ప్రాంతాలను స్థానిక టీడీపీ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పరిశీలించారు. ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు శ్రీకాళహస్తి పట్టణం, తొట్టంబేడు మండలం, ఏర్పేడు మండలం, శ్రీకాళహస్తి రూరల్ మండలం, రేణిగుంట మండలాల్లోని అన్ని గ్రామాలు నీటమునిగాయని, అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ సాయం కావాల్సి వచ్చినా తనను సంప్రదించాలని వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. మోదుగులపాలెం నందు ప్రవహిస్తున్న స్వర్ణముఖినదిని పరిశీలించిన ఆయన గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీలో వరద నీరు నిలిచిపోయిందని అక్కడి ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా... ప్రత్యేకంగా జేసీబీ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.



## జలజీవన్ మిషన్ జీవాన్ని కూడా తీసేసిన జగన్ పాలన

◆పల్లె పండగలో భాగంగా మురికిపూడిలో అభివృద్ధి పనులకు ప్రత్తిపాటి శంకుస్థాపన

చిలకలూరిపేట (చైతన్యరథం): అప్పులు, అక్రమాలు, ప్రజలకు తిప్పలు తప్ప మరో ఊసులేకుండా సాగిన వైసీపీ అయిదేళ్ల పాలనలో జగన్ చివరకు జల్ జీవన్ మిషన్ జీవం కూడా తీసేశారని మాజీ మంత్రి, చిలకలూరిపేట తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలకు రక్షిత తాగునీటి సరఫరాకు ప్లాంట్ల నిర్మాణం, పైపు లైన్లు, ఇంటింటికీ కుళాయిలు సమకూర్చడం వంటి పనుల పురోగతిలో రాష్ట్రానికి వెనకబడి ఉండడమే అందుకు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ 4నెలల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి పల్లెల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా బుధవారం చిలకలూరిపేట మండలం మురికిపూడిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.60 లక్షలతో పీడబ్ల్యూఎస్ పథకం పునరుద్ధరణ, మంచినీటి కుళాయిల ఏర్పాటు , రూ.60 లక్షలతో బైపాస్ రోడ్డు నిర్మాణం, రూ.15 లక్షలతో సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు.



అనంతరం మాట్లాడిన ఆయన రాష్ట్రాన్ని రూ. 14 లక్షల కోట్ల అప్పుల్లో ముంచినా పేదలకు మంచినీళ్లిచ్చే ప్రాజెక్టులకు మ్యాచింగ్ గ్రాంట్లు కూడా విడుదల చేయలేక పోయారన్నారు. ఆ కారణంగానే, చిలకలూరిపేట నియోజకవర్గం, రాష్ట్రం మొత్తం మీద లక్షల సంఖ్యలో ఇంకా ఉచిత రక్షిత మంచినీటి కుళాయిల అందించాల్సిన ఉందని తెలిపారు. ప్రజాప్రభుత్వంలో ఏ సమస్యా లేనందున త్వరలోనే జల్‌జీవన్ మిషన్ లక్ష్యాలు చేరు కుంటామని, పల్లె పండుగలో చేపట్టిన అన్ని కార్యక్రమాల ద్వారా గ్రామాల రూపురేఖలు మార్చు తామన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

◆అధికారులను ఆదేశించిన టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మి

◆జోరువానలోనూ పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు

దర్శి (చైతన్యరథం): జోరు వానలో మూడవరోజు పల్లె పండుగ కార్యక్రమంలో దర్శి తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లె ప్రగతి కోసం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. బుధవారం తాళ్లూరు మండలం తురకపాలెం, దారంవారిపాలెం, మాధవరం గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఇన్ ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల అభివృద్ధి కోసం చేపట్టిన పల్లె పండుగలో వేలకోట్ల రూపాయల పనులు గ్రామాల ప్రగతి కోసం కేటాయించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో దాదాపు 15 కోట్ల రూపాయల పనులను ప్రారంభిస్తున్నామని, ఊరూరా సిమెంట్ రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తూ, కూటమి ప్రభుత్వం ఈ పనులను చేపట్టిందన్నారు. గత వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసి అప్పుల్లో కూరుకుపోయేందుకు విధ్వంసం సృష్టించారని అన్నారు.



వైసీపీ హయాంలో పంచాయతీలు ఒట్టిపోయాయని, తిరిగి ఆ పంచాయతీలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జీవం పోశారని అన్నారు. నాలుగు నెలల కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కడియాల లలిత్ సాగర్, మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, మండల ఎమ్‌పీపీ తాటికొండ శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షులు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఎమ్‌పీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీల సెక్రెటరీలు, ఎన్డీయే కూటమి నేతలు పాల్గొన్నారు.



**ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం శంఖుస్థాపన కార్యక్రమంలో తాడికొండ ఎన్డీయే కూటమి శాసనసభ్యులు తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొని టెంకాయ కొట్టి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.**

